# ఎవరిసేవకులు ?

వి.సౌజన్య

పొద్దుటి నుంచి ఊరంతా సందడిగున్నది. ఊరిపొలి మేరకాన్నుంచి ఊళ్ళెదాక మామిడాకులతోటి దోర్నాలు కట్టింఁడ్రు. నడుమ నడుమ కొబ్బెరాకులతోటి కమాన్లు కట్టింఁడ్రు. ఊల్లనే ఉన్న సర్కారు డప్పుల మేల్లెమంత డ్రెస్ లేసుకోని ఉన్నరు. మేస్త్రి ఈరన్న నోట్ల కీసుపిట్ట పెట్టుకోని డప్పుల మేల్లెం ముందటున్నడు. గౌండ్ల నర్సయ్య తూర్పు తాడిశెట్లల్లకు కావడి భుజాన పెట్టుకొని వొయ్యారంగ నడుసుకుం టవోతాండు. గుంపుగ నిలవడ్డ డప్పుల మేల్లెం నుంచి మేస్త్రి ఈరన్న ముంగ టికచ్చి

"నమస్తే! నర్సయ్యబావ. ఇయ్యాల మాపటీలి మాత్రం మంచి కల్లువొయ్యాలె"

"మాపొత్తగని, ఒక్కపాలి మీడప్పుల సప్పుడు జర ఇనిపియ్యింఁడ్రోయి" నర్సయ్య

"ఓఈరన్నా! ఆనర్సగౌనికేంది మా ఎగురు మంటడు. మల్ల మినిట్టర్‌సాబ్ అచ్చెటాల్లకు కాల్లు లేవకుంటయితయి? గుంటిపోశాలు. ఓ పిలగ ! కాల్లు గుంజకుంట కల్లు మాపొత్తనోయ్ ఎందుకేగిరపడుతానవ్"

"అవ్! మొన్న ఇగ కల్లువోసిండు గౌడు ఏమిరిమ్మ?" గుంటిపోశాలు.

"ఓ మొగోడ ! నీకంతగనం రిమ్మత్తె డప్పు పలిగినా మా శెల్లె ఈపు పలిగినా తిట్లుదినేది నేనే అయితగాదోయి". నర్సగౌడు

"అందుకే పాపం మరిన్ని నీల్లుగలిపి మడ్డి బొంతను మరింతమందం జేసుకుంటానవ్" పోశాలు.

"సరెగని మాటలేనామరి డప్పుసప్పుడు జేసు దేమన్నున్నదా లేదా"?

"అరె లేంఁడ్రిర పిలగాండ్లు, ఒక్కపారి సప్పుడుజేత్తె మంది జమైనట్లుంటది నర్సయ్య బావ మనుసు ఖుషయినట్లు ఉంటది? ఈరన్న

డప్పుల పిలగాండ్లంత గుంఁడ్రగ నిలవడ్డరు. ఈరన్న కీసుపిట్ట ఊదిండు డప్పులు ఝునఝునమన్నయి. నర్సగౌని మనుసు గునగునమన్నది. ఈరన్న మల్లోపారి తురుతురుతురు తూర్‌తూర్‌మని కీసుపిట్టు ఊదిండు.

డప్పులోల్లంత ఒక్కసారి అంతెత్తు ఎగిరిదునికి

ఝూన్ ఝూన్ జజ్జన ఝున జనక గునక ఝూన్ ఝూన్‌మని

డప్పులు వొగిచ్చుకుంట కాల్లుకాల్లు గలుపుకుంట, కాల్ల గజ్జెల సప్పుడుకు డప్పు సప్పుడును జోడిచ్చుకుంట అంగుకుంట లేసుకుంట ఆ పిలగాండ్లు గొడుతాంటె నర్సగౌడు తాళ్ళుగేసుడు సంగతే మరిసిపోయిండు. కండ్లు మెరుత్తాంటె నడువిమ్మోదోసెయ్యి కావడి బద్ద మీదోసెయ్యేసి డప్పుసప్పుడుకు దరువుగ లుపుకుంట నడుమూపుతాండు. గిట్లడప్పు సప్పుడయితే నర్సగౌనికి పానమంత గంతు లేసినట్టయితది.

నర్సగౌనికి పదిహేనేండ్లెల్లి పదారు వడ్డాయి. నాగసరం కల్లు తాగితాగి నిరుడె తంఁడ్రి కాలం జేసిండు. తంఁడ్రిపాలు తాడిశెట్లు నర్సగౌనికే అచ్చినయ్. రెక్క ముదురలేదు. పోరడు గిప్పుడే తాడి శెట్లెక్కుతె నాపగేలుతడని పెద్దమనుసు లన్నరు.

"కట్టమె సుఖమో, దేవుడాను కుంట ఎక్కకపోతె ఉపాసముండి సచ్చుడేగద ? కాలెకడుపుకింతంబలి దొరుకా న్నంటె తాల్లుగియ్యక తప్పెట్టులే"దన్నది. నర్సగౌని తల్లి బాలవ్వ.

బాలవ్వంటె నర్సగౌనికి పానం. నాయినా తాగి తాగి తాడిసెట్టులెక్కకుంటె బువ్వకేం లేకుంటె అవ్వ ఉపాసమున్నా గూడా నర్సన్నకు బుక్కెడు బువ్వ ఎట్లనన్న సంపాయించి పెట్టేది. ఏం లేకుంటె రెండు మక్క కంకులన్న కాలిసిచ్చేది. నాలుగు తెల్లజొన్న కంకులన్న దెచ్చికుమ్ముల వెట్టి అటుకులు గాపి పెట్టి ఆకలిదీర్సేది. రోజు కారంతొక్కు ఎట్లదినుడె నీయవ్వంటె అట్లవొయ్యి నాలుగు పొద్దు దిరుగుడు పూల్‌దెచ్చి గింజలు దీసి పలుకు లొలిసి పచ్చి మిరుపకాయలు, కోతిమీరి, ఉల్లిగడ్డేసి తొక్కునూరి. పెట్టేది ఆ తొక్కంటే నర్సన్నకు-అల్లవ్వంత యిట్టం.

ఝున ఝునమని డప్పులు మోగు తాంటె ఊళ్ళె అక్కడక్కడ పని మీదు న్నోల్లు మినిట్టరచ్చిండనుకున్నరు. జెప్ప జెప్ప బస్‌టాండ్ దిక్కు నడిసింఁడ్రు. బాలవ్వగూడ సేతులున్న పనిని అక్కన్నే యిడిసిపెట్టి డప్పుల సప్పుడు దిక్కు కదిలింది. మినిట్టర్‌సాబ్‌ను కల్సి తన భూమి తనకిప్పించాన్నని అడుగుదామని ఎలచ్చన్ల ప్పటినుంచి అనుకుంటాంది. ఓటు అడి గెతందుకచ్చినప్పుడే దొరతోటి తనబాదంత

ఎల్లవోసుకుందామనుకున్నది. కాని "ఓట్లుగా నియ్యి. అయినంక జూద్దా"మన్నడు దొర

దొర గెలిసిండు. అల్లపార్టీ గెలిసింది. దొర మినిట్టరయిండు. మినిట్టరయినంక దొర ఇయ్యాలనే బాలవ్వ ఊళ్ళెకు అత్తాండు. తన భూమి సంగతి ఇయ్యాల తప్పకుంట దొరతోని సెప్పాన్నను కుంటాంది బాలవ్వ. అందుకే డప్పుల సప్పుడు గాలగనె దొరచ్చిండనుకున్నది. జప జప డప్పుల సప్పుడు కాడికచ్చింది.

డప్పుల మేల్లెం నడుమ ఈరన్న కిసుపిట్టతోటి దరువేత్తాండు. డప్పుల మేల్లెం సుట్టు జనం నిలబడి అల్ల ఎగురుడు జూత్తాండ్రు. జర అటేటని నర్సగౌడు భుజాన కావడితోటి తనుగూడ డాన్సు జేత్తున్నట్టు ఊగిపోతున్నడు.

డప్పుల మేల్లెం నడుమ ఈరన్న కిసుపిట్టతోటి దరువేత్తాండు. డప్పుల మేల్లెం సుట్టు జనం నిలబడి అల్ల ఎగురుడు జూత్తాండ్రు. జర అటేటని నర్సగౌడు భుజాన కావడితోటి తనుగూడ డాన్సు జేత్తున్నట్టు ఊగిపోతున్నడు.

బాలవ్వకు కొడుకును అట్ల జూసెటాల్లు కడుపులకెల్లి ఎసరచ్చినట్టు అచ్చింది కోపం. మొకం మీద చిరునవ్వు తోటి కొడుకు సుతారంగ నడుందింపు తాంటె బాలవ్వకోపం సప్పున సల్లారింది. అచ్చేనవ్వును కడుపులనే దిగమింగుకోని "అయ్యా! కొడుక నర్సవ్వా! ఇక్కన్నే ఎక్కుతానవా బిడ్డె నీతాల్లు"?

"ఆఁ! లేఁ లేదే అవ్వా. డప్పుల సప్పుడై తాంటె మినిట్టరచ్చిండెమో అనుకోని నీతోటి జెప్పుదామని ఆగిన. అగోగా ఈరయ్యనడిగితే ఇంక రాలేదనన్నడు ఇగో పోతనే ఉన్నగాదె"

"మాసరె బాంచెన్ గిట్లయితిగ బాగనె బువ్వదింటమ్, బాగనె బతుకుతమ్"

మినిస్టరచ్చిండని అనుకున్న సంబయ్య పటేల్ అక్కడికచ్చి మినిస్టర్ రాంది జూసిండు.

"అరేయ్! మా కొల్లల్ల పూలుగున్నదాంర ముండకొడుకులాల ఇప్పట్‌నుంచే ఎందుకెగురుతాండ్రురా ? మినిస్టర్ సాబ్ రానియ్యుండ్రి. అచ్చినంక మా సేతనైనంత గురుదురుగాని" అన్నడు.

నంబయ్య పటేలు గద్దరాయించుడుతోటి డప్పుల డాన్సు ఆగింది. బాలవ్వ యింటి తొవ్వవట్టింది.

లంబడి తండనుంచి అడోల్లంత అచ్చిన్రు. దస్రునాయక్ అల్లనందరిని దీసుక్చిండు. ముందట డప్పుల డాన్సు అల్లెనుక లంబడోల్ల డాన్సు అల్లెనుక మినిస్టర్ సాబ్‌ను తోలుకోని ఊళ్ళెకు రావాన్నని నంబయ్య పటేలు పిలానట. అసల్‌నంబయ్య పటేలు ఓడిపోయిన ఎమ్మెల్లెనుట్టె దిరిగెటోడు. గాలంత ఎట్లనో ఉన్నదని గయిన గెలిసెటట్టు లేదని ఎలచ్చన్ల ముందటనే ఈనెను గలిసిండు.

పొద్దుగాలనె అస్తనన్న మినిస్టర్ పదైన రాలేదు. అయిన రాకట ఆలిశమైన కొద్ది నంబయ్య పటేలుకు గావరెక్కువగా వట్టింది. సూసి సూసి అందరూ పొలాల దిక్కువొయ్యెటట్టున్నరు. మంత్రెచ్చెటాల్లకు మంది బాగ లేకుంటె మనకోట్లెసినోల్లు గెల్లేనా అంటె పటెలు గాలివొయ్యె టట్టున్నది. పనులల్లకు మందివోకముందే మంత్రస్తె ఆ మందందరితోటి నీకే ఓట్లేపిచ్చిన నిన్ను గెలిపిచ్చెటందుకు ఎంత కట్టమైందీ ఎన్ని పైసలు కర్సైనయీ అని తన గురించి మంత్రికి జెప్పుకోని ఆయన మెప్పువొందుదామనుకుంటాంటె అయిన రాకపా మెనని కాలుగాలిన పిల్లి తీరున అటూయిటూ తిరుగుతాండు నంబయ్య పటేలు. ఎలచ్చన్ల ముందట నంటె మంది జమగూడెతందుకు ఏముడాల రాములు ఒగ్గుకథవెట్టిచ్చిరి. మరిగిప్పుడు నసోంటి మేమి లేకపామె మంత్రిదగ్గర తనగా లిబొయ్యేటట్టు ఉన్నదని పటేలు మదన పడపట్టిండు.

ఇంతల సైకిల్ మోటర్ మీద మంత్రికి దగ్గరి మనిషి శేఖర్‌బాబు వచ్చిండు.

"అవుబావూ? సారు ఇంకోగంటల వొస్తడా ? నంబయ్య పటేలు

"గదెజెప్పుదామని ముందుగాలచ్చిన పటేల ఇంకోగంట రెండుగంటలల్ల మంత్రిగా రొస్తున్నరు. డప్పులోల్లను, లంబడోల్లను, పూలదండలూ అన్నీ రడీగ ఉంచుకో. ఊళ్ళోల్లందరు పనులల్లకు మెల్లిపోకుండ జూసుకో. ప్రోగ్రామ్ సక్సెస్ అయ్యేటట్లు జూసుకుంటెనే మరి మంత్రిగారి దగ్గర నీకింత పలుకుబడి ఉంటదని జెప్పతందుకే నీదగ్గరికొచ్చిన. శేఖర్ బాబు.

"నా మేలుగోరెటోనివి ఈకాలం తరీఖ తెలిసినోనివి. నువ్వుగా కుంటె నాకు ఇంకెవ్వలు గియ్యన్ని జెప్పుతరు బాపూ? మంత్రిగారొచ్చేవరకు మీరింత ఎంగిలి వడుండ్రి. ఎప్పుడు దిన్నరో, ఏందిన్నరో".

"మరి వంట రడీగున్నదా?"

"ఆఁ! ఆఁ! మా అసోంటి దగ్గరోల్ల కోసం ఓ పదిమందికి వంట జేయించిన గద. అరేఁ! రాజాలు ! శేఖర్‌బాబుకు అన్నం వడ్డించుమని దొరసానికి జెప్పురా"

రాజాలు వెంట శేఖర్‌బాబు అన్నందినే తందుకు పోయిండు.

మంత్రి వచ్చేసంగతి దెలువంగనే నంబయ్య పటేలుకు జర ఉషారచ్చింది.

"అరేఁ! ఈరయ్యా ! మీ డప్పులు సప్పపడవచ్చుగాదుర. మంటకు జర కాపుకోండ్రి. ఎట్ల మోగాలె ఇగ. ఖన్ ఖన్ మనాలె. పోరగాండ్లు ఎగురు తాంటె బిడ్డా! మరిగ దుమ్ములెవాలె."

"అరేయ్! గాముకులోతు కంసుబాయి నిటు రమ్మనా". దస్రునాయక్ భార్య దేవకి, కొంసుబాయి నంబయ్య పటేలు దగ్గ రికంచ్చిండ్రు.

ఓ పిల్లా ! కౌంసుబాయి ని పాట ఆట ఓలి పండుగునాడు నోపినట్టు గాదు. గింయ్యాల జూపాలె సెబాస్ అని పిచ్చుకోవాలె. నేను అయిదరబాదు వొయినప్పుడు మంత్రి కంసుబాయి బాగున్నదా అని నిన్ను యాదికి జేసె టట్టు జెయ్యాలె దాన్ను".

"ఓరి కుమ్మరి మల్లయ్య! దండలేపాటి తయారు జేసింద్రురా ?"

"ఓ యాభైగాలయినయి పటేల. అలువాటు లేని పనయిపాయె.

చేతులన్ని నొప్పులు వెడుతానయ్."

"అయ్యో ! అయితేంబాయె బిడ్డా ! ఒక్కనాటి పని రేపు మినిస్టర్‌సాబ్ మనకెన్ని పనులు జెయ్యడు ?"

"అంతే బాంచెన్."

నంబయ్య పటేలు ఆరాట పడుతాండు. మినిస్టర్ సాబ్ జెప్పనత్తె భాగుండునని రోడ్డు మీద ఏసైకిల్ మోటరచ్చినా ఏ జీపచ్చినా మినిస్టర్ సాబ్ దేనని ఉలికి పడుతాండు. ఉత్తగ పనికి జెడితింగదా ఊళ్ళోల్లు అనుకుంటాంద్రు. సూత్తాంటె సూత్తాంటె మా పటేల్లయింది. గొడ్లు ఊళ్ళెకచ్చె ఏలయితాంది. గప్పుడు పగటీలి అన్నందిని పోయిన శేఖర్‌బాబు సైకిల్ మోటరచ్చింది.

"మినిస్టర్‌సాబ్ వస్తున్నడు. చలో చలో అందరు తయారు గాంద్రి" అన్నడు.

"అరేయ్ ఈరయ్యా! కౌంసమ్మా! అన్నీ సరీగ్గున్నయా జూసుకోంద్రి. పనులన్ని ఉషారుమీద జరుగాలే". నంబయ్య పటేలు.

ఈరయ్య ఒక్కసారి గట్టిగ కీసుపిట్ట ఊదిండు. అక్కడక్కడున్న డప్పుల పిలగాండ్లంత ఈరయ్య దగ్గెరికచ్చింద్రు. పొడుగూత అటయిదుగురు ఇటయిదుగురు రెండు లైన్లు గట్టింద్రు, డబ్బుమీద సిటెకెనగ ఆతోటి సంయం సంయ్‌మని సన్నగ



సప్పుడు జేసుకుంట బండిగట్టిన సహారెడ్డితీరు తయ్యారుగున్నరు. ఈరయ్య తూర్ తూర్ తుత్తురు తుర్ తూర్ తూర్‌మని కేసుపెట్ట ఊదంగనే ఝూన్ ఝూన్ జజ్జనఝున జనక జనా ఝూన్ ఝూన్‌మని డప్పులు మోగినయ్. కాల్లగజ్జెలు డప్పుల సప్పుడుకు కులుకునిచ్చినయ్. సూత్తాంటె రెండు లైన్లు గుండ్రగయినయ్. ఒక్కపారి గుంపుగయి మల్ల సెండేల తీరుగ ఇసిరేసినట్టు దూరమై మల్లలైన్లు గట్టిండ్రు. అల్లెను లంబడి కౌంసెల్య దేవిక మెల్లెం సేతులు గాల్లెకు వేపిగాజుల సప్పుడు ఘల్లుమని పిచ్చుకుంట "యాజీ లెడీ వాడియేవాంచెన్ - గుంగురూవాజే తారియేయా" అనుకుంట నెమిలి పిట్టల తీరుగ అడుగులేత్తాండ్రు.

. మినిస్టర్‌సాబ్ జీబు రానే అచ్చింది. ఆయిన నజర్ల మేంబడాలె నంటె మేంబడా లెనని అందురు ఒక్కపారె ముందటికి దొబ్బుకోని అత్తాండ్రు నంబయ్య పటేలు మందిని పక్కకు జరుపుకుంట ముందటికివోయి మంత్రి మెడల పెద్ద దండేసి గట్టిగ కాగలిచ్చుకున్నడు. మంత్రి తన మెడల దండదీసి నంబయ్య పటేలుకేసి అయిన భుజాలు పట్టుకోని ఊపిండు నవ్వుకుంట. నంబయ్య పటేలుకు మస్తు ఖుషయింది. ఈరన్న ఏం ఇషారజేసిండోగాని డప్పుల మోత ఉరిమినట్టయింది. బుక్కాగులాల్ రయి గమ్మినయ్. నంబయ్యపటేలు ముంగట నడుత్తాంటె ఆయినెనుక మంత్రి మెడల దండలేపిచ్చుకుంట అందరికి దండాలు వెట్టుకుంట వెల్లెగ నడుత్తాండు. మినిస్టర్‌సాబ్ జిందాబాద్ అని శేఖర్‌బాబు అంటాంటె ఎనుకున్నోల్లంత జిందాబాద్ అనవట్టిండ్రు.

మేతకు వొయి గప్పుడే ఊళ్ళెకు దిరిగత్తాన గొడ్లమంద ఊరుజొత్తంగనే డప్పుల మోతకూ మందిలొల్లికీ బుక్కా గులాల్ దుమ్ముకూ బెదిరిపాయి అరిపొలా లల్లవడ్డయి. "మత్తె మత్తె" అనుకుంట గొడ్లబోయిడు ఎంత తిప్పలు వడ్డా బెదిరిన గొడ్లు మట్లకు జేరలేదు. మినిస్టర్‌సాబ్ పొయినసంకగనిరిమ్మదిగి ఎవ్వనంశంల ఎవని గొడ్డు మేసిందోనన్నలొల్లి మొదలుగాదని అనుకోవట్టిండు డప్పులీరన్న.

ఊళ్ళెకేదొ తుఫాన్ అచ్చినట్టయిన సప్పుడుకు పొయిమీద బియ్యం వెట్టిన బాలవ్వకు మినిట్టర్‌సాబ్ రావచ్చునని పిచ్చింది. ఇదువారకె ఓపారి అంతదూరం పొయ్యచ్చుడాయెనని అచ్చిండోలేదో అనుమానం దీరెతందుకు అటు దిక్కు నుంచే ఊళ్ళెకచ్చే సాకలి పోసానితోటి

"అవుపిల్ల మినిట్టర్ దొర అచ్చిండాటనా?"

"మా అచ్చిండాటనత్త! ఇగో గీ బట్టలేసి బువ్వడుక్కచ్చేపనాడ యిడిసిపెట్టి అటే ఉరికిండు నీ కొడుకు. అయినే పెడుతడా టబువ్వ". మినిట్టరచ్చిండన్న మాట ఇనంగనే తలుపు దగ్గెరేసి బంతిపూల దండపట్టుకోని జెప్పజెప్పడప్పుల సప్పుడు దిక్కు నడిసింది బాలవ్వ.

నంబయ్య పటేలు మినిస్టర్‌సాబ్‌తోటి ఏందేందోమాట్లాడుకుంట తన యింటిముంగటేసిన టెంటు కాడికి తీసుకపోయిండు. డప్పుల సప్పుడు, డాన్స్ జేసుడు ఇగబందుజెయ్యిండ్రని నంబయ్య పటేలు గుమాస్తా నారాయణ మైకుల జెప్పిండు. మినిస్టర్‌సాబ్ నంబయ్య పటేలును, అడ్లమిల్లుల సంఘం పెద్ద మనిషినీ, సావుకార్ల సంఘం పెద్దమనిషినీ, బట్టల దుకాణం సంఘం పెద్ద మనిషినీ కుర్సీల మీదికి పిలిసిండ్రు.

ముందుగాల మినిస్టర్‌సాబ్‌ను ఇంక పెద్ద కుర్సీల కూసోబెట్టిండ్రు. మైకుల పేర్లు పిలుత్తాంటె ఒక్కొక్కలె అచ్చి ఆయిన మెడల దండేసుకుంట దండం బెట్టుకుంట, దుప్పటిగప్పి సేతుల సెయిగలుపుకుంట మమ్ములను జెర మీ నజర్ల ఉంచుకొమ్మన్నట్టు జూసుకుంట ఆపసత్తాండ్రు.

బాలవ్వ అక్కడికి జేరెటాల్లకు పెద్దపెద్దోల్లంత దండలు వట్టుకోని నిలబడున్నరు. పేరు విలిత్తెనే పోవాన్నట. బాలవ్వ పేరు యెవ్వలు పిలుతలేరు. తమ మినిటర్‌కు వదలి దండేసి తన అయితనేమోనని బాలవ్వకు బహూరంధయితాంది యింతల బాలవ్వకు అల్లుని వరుసయ్యె సింతపట్ల బానయ్య పక్కపొంటచ్చి నిలవడ్డడు.

"అవుబిడ్డ! ఇగ మనసొంటోల్లను అయిన దగ్గెరికివోనియ్యరా?"

"మనతోటింకేం పనత్తా! మల్లయిదేండ్లకుగద మనతోటి పని".

"అట్లగాదు బిడ్డా ! మరి గాల్లతోటె గెల్సిండాటనా ఈ దొర?

"గెల్సుడు మనసొంటోల్లతోటెగాని. ఇగ గెల్సిండుగద. మరి గిప్పుడిగ అల్లతోటేనాయె పనిమరి?

"నాకు తెలువకడుగుతాన అట్లెట్ల బిడ్డా?"

"ఇగో సూడత్తా ! ఈ దండలేసెటోల్లంత మొన్న ఓడిపోయిన ఎమ్మెల్లె పొయినసారి గెల్సినప్పుడు గూడ గిట్లనే జేసిండ్రు. అల్లు అడివిని నరికి లారీలతోటి లేకుంట అమ్ముకున్నరు ఆయినకు పాలిచ్చిండ్రు.

మీ ఊర్లో జరిగే నృత్య ప్రదర్శనలు, సంగీత కచేరీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల వివరాలు సంక్షిప్తంగా రాసి ఫోటోలతో సహా పంపండి- ఆహ్వానం ఆ వివరాలు ప్రచురించి కళాకారులను ప్రోత్సహిస్తుంది.

- ఎడిటర్.

బియ్యం మిల్లులోల్లు దొంగతనంగ బియ్యమమ్మింండ్రు పొలిచ్చింండ్రు. సావు కార్లను. తనికి జేసెటోల్లువట్టుకుంటె ఇడిపిచ్చిండు - సెందాలు దీసుకున్నడు. సర్గిగ పన్జేత్త లేరని లంచాలు దింటాండ్రని నౌకరిగాల్లను జనం దిదుతాంటె పాపం అల్లను అట్ల దిట్టుకుండ్రి అల్లు మనోల్లే మీ పనులు నేం జేపిత్తగదా అని జనాన్ని అల్లను అడుగకుంట జేసి తనడిగేది తనడుక్కున్నడు."

"గట్ల జెసినందుకేగాదు బిడ్డగాయినను అద్దని గీనెకు ఓట్లేసింది."

"గందుకేసే పిసదాన మనం ఓట్లేసినమా? మనపని అయిపొయిందా?

ఇగ ఎవ్వలపని అల్లు జూసు కుంటాండ్లు. ఇగ బేరసారాలకు అంగడి మొదలయిందన్నట్టు".

బాలవ్వ గుండెల బండవడ్డ ట్టయింది. ఈనె గూడపొయిన ఎమ్మెల్లెసాబ్ తీరేజేత్తడా? అట్ల జేత్తె తన భూమి సంగతంతేనా ? పోయిన ఎమ్మెల్లె అట్ల జేత్తాండనే గదా తను ఇంటింటికి దిరిగి అయినకు ఓట్లెయ్యద్దని జెప్పింది. తనిట్ల జెప్పుతాన్నని తెల్సేగదా ఈ దొరచ్చి "బాలవ్వా! అయిన కెయ్యద్దని జెప్పుతెగాదు బిడ్డా! నాకే ఓట్లన్ని ఏపియ్యాలె"నని అడిగిండు.

"సరే గట్లనేజెప్పి మా ఏపిత్తగాని నా భూమి నాకు యిప్పిత్రవామరి".

"అరే గదెంత పనే యిటు గెలువంగనే అటు ఇప్పియ్యనానె? దొర.

"సరే బాంచెన్. మీరేం ఫికర్ జెయ్యకుండ్రి. మా ఓట్లన్ని మీకే మేత్తం. మీరు మల్లిటు రాకున్నా ఫరువలేదు."

తన భూమి సంగతేందో అడు గనన్న అడుగకుంటనే దొర గెలువంగనే యిప్పిత్తనంటె బాలవ్వకు యింకే అనుమానం రాలేదు. కాని యిప్పుడు మంత్రైన ఈ దొరగూడ మునుపటి ఎమ్మెల్ల తీరుగనే ఆల్లతోనే దండలేపిచ్చు కుంటాండని బాలవ్వకు జర అనుమానమే అచ్చింది. మునుపటి ఎమ్మెల్లే నంబయ్య పటేలు యింటికే నడిసిండు. నాకేం నాయం జేత్తడని ఈ దొరను గెలిపిచ్చు కుంటె ఈనెగూడ నంబయ్య పటేలంటికే దావత్కు అచ్చిండు. యిట్లాలోసించుకుంట బాలవ్వ సూత్తాంటెనే దొర కుర్చీలకెల్లి లేసిండు. నంబయ్య పటేలింట్లకు భోజనా నికి పోతాండు. ఇగజూత్తె కలువదను కున్నది బాలవ్వ. మందిని పక్కకనుకుంట మినిట్టర్సాబ్ దగ్గెరికిపొయి దండేత్తామంటే దారమే ఉన్నదిగాని పూలన్ని రాలిపోయి నయి మినిట్టర్సాబ్ ఏరిపడజేసి "ఏం బాలక్కా బాగున్నావా?" అన్నాడు.

"ఆఁ! అంతమంచే బాంచెన్". బాలవ్వకు మినిట్టర్సాబ్ తనను పేరువెట్టి పిలిసి బాగున్నవా అనెటాల్లకు బాగ సంబురమని పిచ్చింది. కాని బాలవ్వ పొయ్యి బాలక్క నయిన అన్న సంగతి ఆమెకు యాదికి రాలేదు.

"మరి ఇగనేను అన్నానికి పోవన్నా?" అన్నడు మినిట్టరు

"ఆఁ! ఆఁ! పో బాంచెన్. తిను పొండ్రి. ఎప్పుడు దిన్నరో ఏందో" అన్నది బాలవ్వ అచ్చిన సంగతి మర్చిపొయ్యి.

"ఏమాయె మినిట్టర్ను కలిత్తివా అత్త?" చింతపట్ల బానయ్య.

"ఏంగల్సుడు పాడువడ్డది బిడ్డా! పొద్దటి నుంచి ఉంటె ఆ దొరతోటి ఒక్కముచ్చట జెప్పుకునుడుగాలేదు. తినచ్చినంకనన్నగ లుత్తనని ఉన్న".

"గిప్పుడు నిన్నెవ్వలు గలువనిత్తరు. మినిస్టర్సాబ్ ఇయ్యాల ఇంక అయిదూల్లకు పోవన్నాట. అక్కడ సనుమానాలాట. మన ఏరియంత దిరిగెటాల్లకు ఇంక ఎనిమిది రోజులైతదాట. అప్పటిదాక నువ్వాయినను గల్సుడుకుదురనే కుదురదు" అన్నాడు బాలయ్య. నిరాశతోటి యింటిమొఖం బట్టింది బాలవ్వ.

---- x ---- x ---- x ----

నర్సగౌడు తాళ్ళల్ల నుంచి యింటి కచ్చేవారకు ఇంటికాడ అవ్వ బాలవ్వలేదు. యింట్ల నుంచి కాటువాసనత్తాంది. ఏంగాలి పోతాందోనని గావర గావర తలుపు దొబ్బుకోని యింట్లకు పొయ్యెటాల్లకు పొయ్యిమీద బుగ్గెంది గంజాలవెట్టిన బియయం బొగ్గైంది. పొయిమీది నుంచి గంజును దించి కిందవారేసిండు. సేతికి గంజు సర్రున అంటుకున్నది. "అన్నన్న. నేంగువ్వ శెయు నాశిద మావెం గద"ననుకుంటాంటె ఎవ్వలో పిల్సినట్ట యింది నర్సగానికి.

"ఓయ్ ! వాయీ నర్సులూ ! నీ బత్తెపెయ్యి సంగతేంది బామ్మర్ది ? మంది అంశంలవడి వొయ్యాలె సరువ నింద పాలిత్తె బొత్తవలుగ దాగుదామని యిడిసి పెట్టి నవా?"

"ఏఁ నాతోడుబావా! నేను గిప్పుడే అచ్చిన. అచ్చెవారకు అవ్వలేదు. పొయిమీన బువ్వ గంజు బొగ్గయింది. బత్తెకుక్క దిక్కు జూల్లేదు బావ".

"సరె నేనంటె ఇట్ల యింటిదాక కొట్టుకచ్చి నగని యింకెవ్వని అంశంల నన్నవడితె బత్తెదో నీదో నడుమరుగుడేగద ఇగ."

"అవుబావ నీపున్నెం. మరి బాకుంటె దప్పుతదా ?"

"గట్లనే అనుకుంట రేపుగూడ యిడిసిపెట్టు మా శెల్లవ్వలో అచ్చేవారకు నీ నడుం నడుం తీరుగుంటె అడుగు నన్ను".

దూరం నుంచే కొడుకు మాట, కాటువాసన దాకంగనె బాలవ్వ గవర గావర యింట్లకచ్చేవారకు బైరి మల్లయ్య బా సంగతి జెప్పుతాండు.

"ఓ బిడ్డ మల్లన్నా ! మీ బామ్మర్ది తప్పేం లేదు కొడుకా. ఇయ్యాలెందుకో బత్తె పొద్దుగూకంగనే యింటికి రాలేదు. నేనేమోగా మినిట్టరచ్చిండంటె గటు గాలవడ్డ. అంతగనెమైతె ఈ పూట పాలువిండి మీ అవ్వకే పంపుత. ఏమ్మైతాంది బిడ్డా".

"ఆఁ! ఆఁ! బాలత్త పాలు పంపేదున్నదని మా అవ్వతోటి జెప్పితినా అంటె ఇక రేపుపాలె రాకుంటె మా అవ్వ మీ బత్తె జాడకే అత్తది."

"ఓష్ గంతేగద. బత్తెం దోలుకపొయి బంగుళగట్టుపోరాదు బావ". నర్సగౌడు.

"ఆఁ! ఇగ బంగుళాలుంటె మనం గిట్లెందుకుందుం గని. ఇప్పడికె జుట్లు

జుట్లు పట్టుకునుడైతాండె".

"అవుగాని. మల్లన్నా ! మినిట్టర్‌సాబ్‌ను గలుద్దామని పొద్దటి నుంచి జూసినబిడ్డా! నా భూమి సంగతి అడుగుదామంటె అస్సలు ఆటంగాలేదు."

"ఇగో బాలత్త ! గిట్లగాదుగాని ఆయిన పట్నంబొయినంక అక్కడికివోవాలె. ఇగ గక్కన్నయితె గింతమందుండరు. సంగ తంత మంచిగ జెప్పుకోవచ్చు".

"నిజమేగని బిడ్డా ! పట్నం నేనెప్పుడు పోకపోతిగా బస్సులు ఎక్కడెక్కి ఎక్కడ దిగాలె మంతిరి యిల్లెక్కన్నో యివ్వన్ని నాకెవ్వలు జెప్పుతురు బిడ్డా ?"

మల్లయ్య ఆలోచన్ల వడ్డడు. తనైతె మినిస్టర్‌సాబ్ కోసం పట్నం పోదామను కుంటాండు. ఈమెను గూడ రమ్మంటె నా మెడకు వడదిగదా అని ఆలోచన జేత్తాండు.

"సచ్చి సర్గాన అయనెక్కడున్నడోగాని ఈ నంబ ముండకొడుకు మమ్ములనేమి అరిగోసవెట్టుకోవట్టె. ఎసోంటి మనిసినెట్ల జేసె. నా సంసారానికెట్ల నిప్పువెట్టె" నంటాంటె బాలవ్వ కండ్లల్లకెల్లి నిప్పులు రాల్తాంటె ఆమె సూపు ఎక్కడికో ఎల్లి పోయింది.

బాలవ్వ పెనిమిటి రాజన్న మాంచి అజానుబావు. నల్లటి కండలు దిరిగిన దండలు ఆ తాటిశెట్ల తీరుగనే బురుసు గున్న నల్లటి దొడలు. కోరలు దిరిగిన మీసాలు నెత్తికి రుమాలు నడుముకు ముత్తాడు తోటి రాజన్నను జూత్తె పైల్వాను తీరుండెటోడు. మంచి మాటకారి. సిన్న సిన్న పంచాయితీల కాడికి రాజన్నను పిల్చెటోల్లు. అక్కడి పంచాయితుల సంగతులు అన్ని బాలక్కతోటి కండ్లకు గట్టినట్టు కథ తీరుగ జెప్పుతాంటె తెల్లటి పలువరుస జూసుకుంట బాలక్క మైమరిసిపోయేది. రాజన్న ముచ్చెట జెప్పుడు అయిపోంగనే తెలివికచ్చి "ఆఁ! మాసరె పని గంగల గలిపి పంచాయితులు జెప్పవోకడ. అయిదెచ్చి మల్లనాకిక్కడ జెప్పినాపని పాడు జేసుడ"ని విసుగు పడేది.

అసోంటి సంసారం మీద నంబయ్య పటేలు కన్నుపడ్డది అయిన రైసుమిల్లు గట్టుకోవాలె. ఊరునానుకోనే వరిపోలాలున్నయి. పొలాల నడుమ నుంచి సడుగువోతాంది. రాజన్నకు సడుగు పక్క పొంటి రెండెకరాల సెలుకున్నది. ఆ సెలుక దుబ్బను ఎల్లమ్మ గడ్డంటరు. దానికి అటూ ఇటూ రెండు దిక్కుల పొలులె ఉన్నయి. ఆ గడ్డను పొలం జెయ్యాలెనంటె లోతు బంటాలు దీపియ్యాలె. అన్ని పైసలు రాజన్న దగ్గెరలెవ్వు. మల్ల ఆ దుబ్బ గడ్డిమీద దాదాపు యాభై తాటిశెట్లున్నయి. పొలం జేత్తె తాటి శెట్లువోతయి బతుకు దెరువు వోతదని కులపోల్లు బతిమిలాడితె అక్కెమాల్‌కాన అత్తనే ఉండెనని ఆ గడ్డనట్లనే ఉంచిండు. పజ్జొండ్లు వోత్తె ఎండకాలం అంబలి మందం పండు తానయ్.

ఆ గడ్డమీద రైసుమిల్లు గడితె పొలా లల్లనుంచి సక్కక రైసుమిల్లులకు అడ్లు దేవచ్చు. రోడ్డు మీదినుంచి ఇగ బియ్యాన్ని ఎటుపడితటు పంపుకోవచ్చునని నంబయ్య పటేలు ఇసారం జేసిండు.

ఎప్పుడైనా రాజాలు అనో రాజయ్య అనో పిలిసే నంబయ్య పటేలు ఓనాడు మాపటీలి రాజన్న తాళ్ళెక్కి యింటికి వోతాంటె.

"ఏమోయ్ రాజగౌడ అంత మంచేనా" అన్నడు.

"ఆఁ! మామంచికేంది పటేల, మీరంత మంచిగుంటె మేం మంచిగున్నట్టేగద?"

"అవుననుకోగని యింటికివోయి నడుమిడిసి మంచిదో పదిరూపాయల కల్లుపట్టుకొని అత్తవానోయ్?"

"యింటికి వోకడెందుకు పటేల మాదయ్యా పటేలు ఆడుక బుడ్డి కాపడికే ఉన్నది. యిది మీరు దీసుకోండ్రి. అయినకు యింటికాన్నుంచి దీసుకపోత."

"లేలే. ఆయినది మనకెందుగ్గని నువ్వింటికి వొయి కాల్జెతులు గడుక్కున్నంకనే పట్టుక రాపోరాదు. జల్దేమిలేదు."

"సరే పటేల".

రాజన్న యింటికివొయి నడుము కున్న ముత్తాదిడిసి కాల్లగుజికి లటుకమేసి మడ్డిబొంతను ముత్తాదు సుట్టి గట్టి సిలు క్కొయ్యకు తలిగిచ్చిండు. బాలక్క పొయిమీన్నుంచి నీల్లుదించి అంపుల కాడవెట్టింది. ఈపు మీదికెల్లి ఉడుకుడుకు నీల్లువోసుకుంటాంటె బాలక్క రాజన్న ఈపు రాయవట్టింది. ఈపు మీద వేరిన శెముట కల్లుగియ్యంగ ఛాతిమీదవడ్డ కల్లుమడ్డినంత బాలక్క రాత్తాంటె రాజయ్య "సక్కల గులెత్తాంది. ఒక్క ఈపుమీద రాయరాదు సాలు" అన్నడు.

"అయ్యో! పిలగాడింక పడుసోడైతాండే" బాలక్క

"అగ్గో! ఒక్క పిలగాడువుట్టంగనె నువ్వు ముసల్దానివైతివా నేను ముసులోన్నైతినా? అయినా ఇప్పుడే నన్ను పిలగాడంటివి గద. పిలగాడంటె మరి కోల్లాగె తీరె ఉంటది మరి".

"ఓ ! ఉషారు. మాసాల్ తియి పొయిమీద బువ్వేమైతాందో" అనుకుంట బాలక్క యింట్లకు వొయింది.

కాల్జేతులు కడుక్కున్న రాజన్న "నేను నంబయ్య పటేలుకు కల్లు ఇచ్చిత్త" అనుకుంట బయటికెల్లిండు.

నంబయ్య పటేలింట్ల కల్లువెట్టి "పటేల అగో కల్లక్కడవెట్టిన"అనుకుంట ఎనుకకు మర్రిండు.

"ఏమాయెనోయి పోతానవు రాజగౌడ. ఆగాగు గిలాసతోటి దాగుతె తాగినట్టుండ దోయి. అంచుదువుగానుండు" మన్నడు. రాజగౌడు ఒక్కదమ్ముకల్లరిచిండు. నంబయ్యపటేలు ఇంట్లకువొయి సీసదెచ్చి మూతదీసిగిలాసవోసి "తీసుకోవోయ"ని రాజగౌనికిచ్చిండు.

రాజగౌడు అప్పుడప్పుడు బరండి పవ్వ దీసుకుంటడు. పంచాయితుల్లకు మొదట్ల పొయినప్పుడు పంచాయితయిపొయినంక అందరు అక్కన్నె గూసోని దండుగు పైసల్తోటి కల్లుదెచ్చుకొని దాగెటోల్లు. రాజన్న "నేను గౌండ్లకులంలబుట్టి కల్లుదాగ"నంటె సరెకానియ్యని ఇగో

## వాక్‌హూమ్స్

నిన్ను నీవు ప్రేమించుకోవటం
నేర్చుకోలేనంత వరకూ
ప్రపంచం నిన్ను ప్రేమించదు
ప్రపంచాన్నీ నీవు ప్రేమించలేవు.

వొళ్లంతా రసిగారే గాయాలతో
దారంతా పరచుకున్న ముళ్లతో
కాలం బాటపై నడవలేనవుడు
అడవిలో పిడికిళ్ల చెట్టుగా మొలిచాడు!

---- *ఏటూరి నాగేంద్రరావ్*

గిబరండన్న దాగాలె మాతోటని జెర్ర జెర్ర అలువాటు జేసింద్రు. కాని గిపటేలింటికాడ దాగుడెట్లనని అనుమానం జెయ్యవట్టిండు. "నేందాగుతాంటె నువ్వట్టిగ కూసుంటె నాకు మనుసునవట్టదోయ్. అసలు నాకు తాగినట్టే అనిపియ్యది. నేనే ఇయ్యవడితి నీకేందోయ్. ఇగో కల్లుగాడ సొల్లుకాడ సిగ్గుపడితె కుదురది. తాగు తాగు. ఎంగాద"ని మొగమాటువెట్టిండు.

"ఇగో రాజగౌడ ఈకాన్నుంచి రోజూ పది రూపాయల్దీ ఆడుకవట్టుకరావోయి. రోజుమాపటీలన్నడు".

సరెనని రోజు కల్లుబుడ్డి దెచ్చుడు బరండి నీసదాగుడు అట్లలువాటయిందు రాజగౌడు నెల నెల ఆడుకపైసలు దోను ఇంకో మున్నూరైతానయి బరండికి.' పదినెల్లవారకు మూడు వేలయినయి. ఇంకో ఏడు వెయిలసేతుల వెట్టి నిషామీదున్నప్పుడే సెలుక రాయించుకోని పట్టజేయించుకున్నడు నంబయ్య పటేలు. ఆ ఏడు వేలొసినంక గుడుంబ కెగవడ్డ రాజగౌడు గుండె తూట్లువడెదాక దాగిండు. దగ్గి దగ్గి జచ్చిండు. మొగుడు సచ్చినందుకూ ఉన్నొక్క సెలుకవొయినందుకు, కన్నొక్క కొడుక్కు దిక్కుదీములెక్కుంటయినందుకు బాలక్క ఎడిసేడిసి నెరివడ్డది. కడుపు కుమ్మరాం తీరైనప్పుడు నంబయ్యపటేలు మీద మన్నెత్తి పోసింది. అయిన పోలీసులతోటి జెప్పి తనింటిదిక్కుగాని, రైసు మిల్లు దిక్కుగాని పోకుంట కట్టడిజేపిచ్చిండు.

"అరె ! ఆనిరైసుమిల్లుకోసం ఉన్నొక్క సెలుక గుండుకునె అయితెమానెనంటె కట్టం సుఖంబంచుకోని కడదాక గూడుండే జోడును లేకుంట జెసె. ఆనిమీదింత మన్నెత్తి పోద్దునా అంటే నన్నే తప్పినిరి. అయ్యా ! ఇదెక్కడి నాయం" అని బాలక్క కనిపిచ్చినోల్లనందరినడిగింది.

దీనికి పిచ్చిలేత్తదన్నరు. కొడుకు నర్సన్న అవ్వను గాగలిచ్చుకోని "అవ్వా ! నాయిన తాడిసెట్లు నేనెక్కుతనే. నువ్వేడువకు. నేను నిన్ను సాత్తనే"అని మొకంల మొకం బెట్టి ఏడిత్తె కడుపుల పేగులు కలికలి అయినయి. కొడుకును జూసుకొని మొండిధైర్నం జేసుకోని బతుకుతాంది. పొయిన ఎమ్మెల్లెకు జెప్పుతె అయిన తింపిచ్చుకోని తింపిచ్చుకోని "నంబయ్య పటేలుకు పట్టయింది గద? నీకెట్లత్తది బిడ్డా?" అన్నడు.

"బాలత్తా! రాజన్న మావ మతికచ్చినాడె" అన్నడు బైరి మల్లయ్య

"ఏం జెయ్యాలెబిడ్డా! రెక్క బొక్క ముదరని పోరన్ని సుక్కల్లకు పంపవడితి. ఆని కాల్జారినా సెయ్యి జారిన నాకాడు గనిపిత్తడా ఇగ. కల్లుకుండ మోసిమోసి మాడకామెగాసె. నా కమ్మల గుడిసె తడుకల గుడెసయిత లేదు. మాగోసదాకి ఆనంబని పీనుగెప్పుడెల్తదో. మా ఉసురుదాకి ఆడెన్నడు వోతడో"ననుకుంట బాలవ్వ వల వల కన్నీరు దీసింది.

"గట్ల ఏడుత్తె మన కట్టాలేడ దీరుతయత్తా! ఏడువకు గని నేను గూడ పట్నం బోదామనుకుంటాన మినిస్టర్‌సాబ్ దగ్గెరికి పొయ్యటప్పుడు నిన్ను గూడ దీసుకపోత"

"అబ్బ తీసుకపోబిడ్డ నీబాంచెన్. సచ్చి నీకడుపుల పుడుత. మల్ల మరిసిపొయ్యేవు గిట్ల"

"అవుగని మల్లయ్య బావ ! నీకేం పనివడ్డదోయి పట్నంతోటి?" నర్సగౌడు.

"ఏం జెప్పన్నోయి ఓట్ల ముంగట ఎవ్వలో యిద్దరు మనూల్లకచ్చింద్రోయ్. ఓట్లు యెవ్వలకేత్తాంద్రయ్యా" అని అడిగింద్రు. "ఎవ్వలకేత్తే ఏమున్నది? నలుబయేండ్ల నుంది ఏత్తనే ఉన్నమ్. తాగెతందుకు నీల్లు లెవ్వు రోగాలచ్చి సత్తానమంటె దావకాన లేదు. మా పోరగాండ్లకోబడివెట్టుమంటె పెట్టరాట గాని మాపటీలి మాకు సదువు జెప్పుతరాట. పొలానికిన్ని నీల్లు వెట్టుకుందామంటే బాయిల నీల్లుండయి పోలుకు కరంటుండది. మేం జచ్చేసావు జూసెటోల్లు లెరు మేం బతికే బతుకు జూసెటోల్లు లేరు. ఎవ్వలకోటేత్తె ఏమున్నద"దన్న.అది పాపమై పొయిందోయ్. మాపటీలి ఊళ్ళకు జీపచ్చింది. నడువు టేషన్ కన్నరు. పెయ్యంత సింతపండు సింతపండు జేసింద్రు. టాడకేసు వెట్టింద్రు. ఓట్లేపిచ్చుకునే తందుకు నన్నెయితె యిడిసిపెట్టింద్రుగాని కేసట్లనే ఉన్నది. ఎస్పీసాబ్ తోటి జెప్పి కేసుగొట్టేపిత్తనన్నడు మినిస్టరు. గా సంగతేమాజ్జేద్దామని.

--- x --- x ---x ---

"కొడుకా మల్లన్నా! అబ్బగిన్నేసి అంతురాల బంగులాలు ఎట్లట్టిండ్లు బిడ్డా?" యాటిని గట్టైతందుకు ఎన్ని పైసలైతయి ? అవ్వన్ని ఎక్కన్నుంచి అత్తయి. అబ్బబ్బ మనూరోల్లు గిసోంటి బంగుళాలుంటయని కలలగూడ అనుకోరు. యెనుకటి మానాయిన జెప్పెటోడు గిదే గీ నంబయ్య పటేలు తాతట, సుట్టు పదూల్లు ఆల్లమేనట ఆ ఊళ్ళైలెతందుకు గడీలు గట్టింద్రట. ఆ గడీలల్ల రెండంతురాల బంగుళగట్టింద్రట. అయిగట్టైతందుకు ఊళ్ళల్లనుంచి ఎట్టివట్టుడేగకుండ పండిచ్చిన పతిపంటల యింత పంట, కుమ్మరోల్లు కుండలు, కమ్మరోల్లు పారలు అడ్లోల్లు తలుపులు దరువాజలు యిట్ల అన్ని దెప్పిచ్చి కట్టింద్రని చెప్పేది. ఒకక రెండంతురాల బంగుళ గట్టైతందుకే ఆనాడు ఆల్లుగంతకతజేత్తె మరి గియ్యల్ని గట్టైతందుకు ఎంత కత జరుగుతాందో సముజైతలేదు". బాలవ్వ హైదరాబాదుల

సెక్రటేరియట్ బిల్డింగులు జూసిఅన్నది.

"అవునత్తా గప్పుడు గాపదిరువై ఊళ్ళేలెతందుకు అళ్ళకు ఆ గడీలు బంగుల సరిపోయింది. మరిప్పుడు ఈ ఇరువైమూడు జిల్లాలేలెతందుకు ఆ లెక్కన ఇన్ని బంగులాలు అక్కెరవడుతానయి." మల్లయ్య.

"మొత్తం మీద అప్పటి గడీల నమోననేగద ఈ అంతురాల బంగులాల కచ్చీర్లు? అగగోగటు జూడు బిడ్డేనే బాంచెన్. గన్ని జీపుకార్లు. అయ్యన్ని ఈ కచ్చీర్లల్ల ఉండెటోల్లమేనా?".

"అళ్ళయి. అళ్ళతోని పనివడి వచ్చేపెద్ద పెద్దోల్లయి".

ఆ జీపుకార్లు జూసి ఆమాట యినంగనే బాలవ్వకు ఒడ్డోల్ల లచ్చిమన్న మాటలు యాదికచ్చినయం. మేమంత కంకర గొట్టినన్ని రోజులు మాగుత్తెదారు జీపుకార్ల దిరుగుతడు. అల్ల జీపుకార్లకున్న ఇనుప పట్టీలన్నీ మా ఒడ్డోల్ల పక్క బొక్కలెనన్నది. ఆ జీపులగాలె పిట్రోలంత మా ఒడ్డోల్ల నెత్తురేనన్నది. ఆ ఒక్క గుత్తెదారు జీపుకారు నడువాన్నంటెనే మా ఊళ్ళె ఒడ్డోల్ల నెత్తురంత కలికలిగావట్టె మరి గిక్కడ గిన్ని జీపుకార్లు దిరుగుతానయంటె అబ్బ ఎందరి నెత్తుర్లవిసిపోతానయోనని బాలవ్వ గుండె సెరువయింది.

యింతల మల్లయ్యకు శేఖర్ బాబు గనిపిచ్చిండు. పొద్దుగాలనే శేఖర్‌బాబుకు మల్లయ్య జెప్పిండు మినిస్టర్‌సాబ్‌కు మమ్ముల గలిపియ్యిమని

"సరే మీరచ్చిన సంగతి మినిస్టర్‌సాబ్‌తోటి జెప్పుత"నని పొద్దుగాల వొయిన శేఖర్‌బాబు ఇగో గిప్పుడు మాపటెల్ల అయ్యేటాల్లకు మల్లగనిపిచ్చిండు.

"ఏమాయె శేఖర్‌బాబు మా సంగతి మినిస్టర్‌సాబ్‌కు జెప్పినవా? సచ్చిపోతానమ్ పొద్దట్నుంచి ఆకలికో దూపకుయ" మల్లయ్య

"గట్లంటెట్లనయ్యో! అగో గా రాయమల్లును జూడు. పదిహేను రోజులాయెనట. దొరమనదిక్కు సన్మానాలకు దిరిగినప్పుడు

వాక్‌హూమ్స్

నీరు ఏటి కోసం పుట్టిందా?
పండు చెట్టు ఆకలి తీరుస్తుందా/
మీరంతా ఎవరి కోసం పుట్టినోళ్లు?
మీకోసం పుట్టిన వారెవరెవరు?

అనాదిగా ఆదిమ మానవుడు మొదలు
అఖండ పోరాటం చేస్తూనే వున్నా
ఏనాడూ ఓటమి ఎరుగని
వొంటరి సైన్యం ఆకలి!

చేసినన్ని పాపాలు చేసి చేసి
ఏడాదికో ఆకు పూజ జరిపిస్తే
బాబూ! చెప్పరా దేవుడేమైనా
పాపాలు మోసే మున్సిపాలిటీయా/

రాళ్లనుంచి దేవుళ్ల దాకా
ఎడారుల నుంచి సముద్రాల దాకా
ఎన్ని మార్పులు చవిచూసిందో
నేల ఎంత వేదన భరించిందో.

ఏ రాజకీయ పార్టీ అయితేనేం
ఏ కొత్త గొంతుక వినిపిస్తేనేం
వీణ ఏదైనా సరే
భైరవిరాగం ఒకలానే పలుకుతుంది!

— ఏటూరి నాగేంద్రరావ్

మాట్లాడుదామంటె కుదురలేదట. మూడు రోజులనుంచిపడెరావుపడున్నడు. అయినా దొరతోటి మాట్లాడెతందుకు టైమ్ దొరుకుత లేదట. అయినా గూడా మీరచ్చిన సంగతి పొద్దుగాల దొరతోటి జెప్పిన. ఉండుండ్రి దొర బైటికచ్చినప్పుడు కనిపియ్యిండ్రి" అనుకుంట శేఖర్‌బాబు ఎల్లిపోయిండు.

మల్లయ్యకు సముజుగాలె. మేం మీ కోసమే ఉన్నమంటరు. ఓట్లయి రెన్నెల్లయిపాయె. ఊళ్ళల్లకత్తె సన్మానాలంటరు. కలిసేటైము లేదంటరు. ఇక్కడి కత్తె పెద్దపెద్దోల్లు కార్లల్ల అచ్చి కలిసిపోవట్టిరి. మనసోంటోల్లను కలువనియ్యరాయె అసలు ఈల్లు ఎవ్వల కోసం గెలిసినట్టొ అని ఆలోచన జేత్తాండు.

ఇంతాల లోపలి నుంచి జవానచ్చిండు. "జరుగుండ్రి జరుగుండ్రి మినిస్టర్‌సాబ్ వస్తున్నడ"న్నడు.

బాలవ్వ, మల్లయ్య ఎదురుంగ వొయి మినిస్టర్‌సాబ్‌కు దండం బెట్టిండ్రు. "బాంచెన్ నా సంగతి జెప్పుకుందా మనచ్చిన. పొద్దటినుంచి గా మల్లయ్య నేను మీ కోసం యిక్కన్నె ఎదురు మూసుకుంట ఉన్నమ్" బాలవ్వ.

"ఆఁ! తెలిసింది. మల్లయ్యా నీ కేసు గురించి మాట్లాడిన. నీ మీద టాడకేసు బుక్ అయిందట. అదిప్పుడు కొట్టేసుడు కుదురదట ............ ఏం జెద్దాం చెప్పు? ........ ఇగో ఓ పంజెయ్యి. ఇప్పుడైతే షేషి షేషికి కోర్టుకు అజురుగా తర్వాత ఆలోచనజేద్దాం".

"ఆఁ! బాలక్కా! నీ సంగతి ఆర్‌డిఓ తోటి మాట్లాడిన. ఆ భూమి నీ భర్త నంబయ్య పటేలుకు అమ్మిండట. పట్టగూడ అయిందట. నీకురాదు. ఇగ అనవసరంగ దిరుగకు ఇంటికిపో" అన్నడు. మినిస్టర్

"అట్లెట్ల దొరా బాంచెన్. ఆ భూమి మా పెద్దలప్పటి నుంచి మాదె. నాకో మొగ నలుసున్నడు. ఆని సంతుకమన్న. నాసంతుకమన్న లేకుంట అది నంబయ్య పటేలుకు పట్టెట్ల అయింది దొరా?" బాలవ్వ

"యిగో బాలమ్మా! నా కబద్దాలాడ రాదు. మిమ్ములను అనవసరంగ తింపుకోవడం నాకిష్టంలేదు. వాస్తవం జెబుతున్న అదీ విషయం. నాకింక చాలా పనులున్నయి "అనుకుంట మంత్రి బుగ్గ కారెక్కి ఎల్లిపోయిండు. మంత్రి మాటలు బాలవ్వ మెదడు మీద మరో సమ్మెట దెబ్బ తీరుపడ్డయి. మెదడుల వేడెక్కిన నరాలు ఏదో సదురుకున్నట్టయినయి. ఏదో దృఢమైన దీక్ష బూనినట్టు బాలవ్వ తన ఊరు దిక్కు పొయ్యే బస్‌కోసం అడుగు లేత్తాంటె మల్లయ్య గూడ బాలవ్వ అడుగు లల్ల అడుగులెసుకుంట నడిసింది. ●